# ఈ తరం ప్రేమకథ

రచన :
శ్రీ ఎ. ఎమ్. అయోధ్యారెడ్డి.

(గత సంచిక తరువాయి)

రాజశేఖరంగారు వెంటనే రవికో ఉత్తరం రాశారు. అందులోని సారాంశం ఏమంటే వాణి అతనంటే చాలా ఇష్టపడుతుందనీ, ఈ విషయం కేశవ్‌తో సంప్రదించాననీ, అతనుకూడా ఎంతో సంతోషంగా ఒప్పుకున్నాడనీ, నీ అభిప్రాయం రాస్తే కట్నం కానుకల విషయం తానక్కడకు వచ్చి మాట్లాడతాననీ వుంది.

రవి తల్లితో ప్రస్తావించి దానికి తిరుగు జాబు ఈ విధంగా వ్రాశాడు.

శ్రీ రాజశేఖరంగార్కి, అభివాదములు. మీ లేఖ అందింది. మీ అమ్మాయి వాణి అభీష్టాణి తృణీకరించకుండా మా వివాహానికి ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు. నిజానికి మేమిరువురం ఇదివరకే ప్రేమించుకున్నామని చెప్పాలి. ఇక కట్నం తీసికోవడం నా ఆశయానికి విరుద్ధం.

మీరింకేమైనా మాట్లాడ దల్చుకుంటే దయచేసి పరంధామయ్య బాబాయ్‌తో సంప్రతించండి.

నమస్కారాలతో,
రవి.

* * *

ఆ తర్వాత రెండు మాసాలు అనంతరం!

హైదరాబాదులోని రాజశేఖరంగారి భవనపు ప్రాంగణంలో అందమైన రెండు వివాహ వేదికలమీద, ముచ్చటైన రెండు జంటలకు వైభవోపేతంగా పెళ్ళిళ్ళు జరిగాయ్.

రాజు—సరోజ
రవి—వాణి

పెద్దలందరి ఆశీర్వాద బలంతో తమ భావి జీవన రథంలోకి ఇద్దరిద్దరు ఒక్కటిగ మారి, అధిరోహించారు.

ఇంత జరిగినా రవి మనసులో ఒక చిన్న అనుమానం అలానే వుండిపోయింది.

ఆ రోజు బస్సులో తనూ, రాజూ కల్సి ప్రయాణం చేస్తుంటే వాణి అలా పల్లెటూరి యువతిలా ఎక్కణ్ణించి వస్తోంది అని?

ఆ రోజు రాత్రి! తొలి ప్రేమానుభవం తొలకరి జల్లులా కురిసి మేనులు పులకరింపజేసే మృదు మధుర రాత్రి!!

మల్లెలు పిలిచే వేళ, నిండుగా అలంకరించుకొని గదిలోకి అభిసారికలా వచ్చిన వాణిని మొట్టమొదట ఇదే ప్రశ్న అడిగాడు రవి.

"అబ్బా! మీరింకా ఆ విషయం మర్చిపోనట్లుందే" అందంగా మందహాసం చిందిస్తూ అంది వాణి.

"పోనీ ఇప్పుడు చెప్పరాదూ!"

"నేనారోజు మా అమ్మమ్మగారి ఊర్నించి తిరిగి వస్తున్నానండీ! ఆవిడకు ఫోర్గా, నవనాగరికంగా వుండే అమ్మాయిలంటే అసలు గిట్టదు లెండి. నేనెప్పుడూ వెళ్ళినా రెండు నేత చీరలో, లేకపోతే వాయిల్ చీరలో, అదీకాకపోతే ఓ పట్టు పీతాంబరమో తయారుగా అట్టి పెడుతుంది. ఇక నేనవి వచ్చినట్లు కట్టుకోవాలి. పట్నం వెళ్ళాక కూడా కట్టుకుంటాననీ ప్రతిసారీ ఒట్టు అనిపించుకోందే వదలదు. ఆ రోజు అంతే! అదే వాయిల్ చీరతో బస్సెక్కాను, దాంతో నేను పల్లెటూరి యువతినంటూ బల్లగుద్దేశారు బస్సులో మా సైకాలజీ బావగారు" అంటూ పకపకమని బిగ్గరగా నవ్వింది వాణి.

"ఆఁ! ఆగాగు అట్టే బిగ్గరగా నవ్వకు, బయట్నించి మా ఆడంగులు వింటారు" చిన్నగా నవ్వుతూ అన్నాడు రవి.

"ఆడంగు లేమిటి"

"అదే ఆడవాళ్ళు" సరిచేశాడు రవి.

వాణి సిగ్గుపడింది, ఆ అలంకరణలో, సిగ్గుపడడంలో ఏదో ద్విగుణీకృతమైన అందం గోచరించింది రవికి. మెల్లగా వచ్చి ఆమె భుజంమీద చేయివేశాడు రవి.

"వాణీ!" జడ నిండుగా వున్న మల్లెల్ని వాసన చూస్తూ మత్తుగా పిలిచాడు రవి. పరవశించి పోయిందామె, తేరుకొని "ఏమిటి నవీన్‌గారూ" అంది చిలిపిగా.




"నా పేరు రవి"

"మరి నవీన్ ఎవరో ?"

"అది నా కలం పేరు"

"సరే! రచయిత రవిగారూ అంటాను"

"అలా పిలవటం తప్పు తెలుసా!"

"ఏం ?"

"భర్తను పేరుతో పిలవరాదని సాంప్రదాయం తెలుపుతోంది"

"అందుకే నవీన్ గారన్నాను"

"పో చిలిపి! అసలు నా మాట వినవేం ?"

"ఏమిటో అది ?"

"అదే,మన ఈ ప్రేమను కథగా రాయమన్నావుగా"

"అవునూ"

"మరి దానికి ఏం పేరు పెడదాం ?"

"మీరే చెప్పండి"

"ఊహుం! నువ్వే చెప్పాలి" వాణి క్షణంపాటు ఆలోచించింది "ఓ 'ప్రేమ కథ' అని పెట్టండి" అంది.

"అబ్బె! ఏమీ బాగా లేదు వాణీ!"

"పోనీ! ఓ ఫలించిన 'ప్రేమ కథ' ఇది బాగుందా?"

"ఊహుం!" రవి మత్తుగా నవ్వుతూ వాణిని తన మీదకు లాక్కున్నాడు.

"మరెప్పుటో మీరే చెప్పండి బాబూ చంపక!" అతని కౌగిలిలో పరవశంగా వొదిగిపోతూ అంది వాణి.

"మన వాస్తవ కథే ఇంత చిత్రంగా వుంది వాణీ! మరి కథ అన్నాక ఎన్నో కల్పనలు చేసి రాయాల్సి వస్తుంది, ఇంకా అదెంత గమ్మత్తుగా వుంటుందో"

"అయితే! కథలో యువతీ యువకులకో ప్రయోజనాన్ని చూపెడదామనుకుంటూన్నా రన్నమాట"

రవి కొంచెం యోచించి "గుడ్ వాణీ! అలా చేద్దాం బాగుంటుంది"

"మరి దానికి 'ఈతరం ప్రేమ కథ' అని పెట్టండి పేరు"

"థాంక్స్ శ్రీవిశ్వేశ్వరీ! నీ ఊహ టెక్నిక్ బాగుంది. ఈ టైటిల్ ఓ.కే. చేస్తున్నాను"

"నో మెన్షన్ హృదయే...శ్వ...!" వాణి మాటలు పూర్తి కానివ్వకుండా ఆమె పెదవుల్ని, తన పెదవులలో మూసేశాడు రవి.

గది చీకటైంది, కరెంట్ ఫెయిల్ అయిందో మరేమిటో తెలియదు. బయట వెన్నెల మసక బారింది. చంద్రుడు సిగ్గుతో మబ్బుల చాటున తప్పుకున్నాడు.

(సంపూర్ణం)

కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
స్థాపితం - 1938.
విడి ప్రతి — 0-40 పైసలు.
సంవత్సర చందా — రూ. 7-50.
(రెండు ప్రత్యేక సంచికలతో సహా)
నేడే చందాదారులుగా చేరండి.